ప్రజాశక్తి
ఆదివారం 14, మే 2023
5
అనంతపురం

ఎదురొడ్డి పోరాడి....

బాగేపల్లిలో సిపిఎంకు మూడవ స్థానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం ఎదురొడ్డి పోరాడింది. నాలుగు స్థానాల్లో పోటీ చేసిన సిపిఎం అభ్యర్థులకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రత్యర్థి పార్టీలు అనేక ఆటంకాలు, అవరోధాలను సృష్టించినా తట్టుకుని నిలబడి పోరాడింది. బాగేపల్లిలో త్రిముఖపోరు నడిచింది. ఎన్నికల ముందు ఆయన పోటీ నుంచి తప్పుకున్నారంటూ బాగేపల్లి సిపిఎం అభ్యర్థి అనిల్ కుమార్‌పై ప్రత్యర్థులు విషప్రచారం చేసినప్పటికీ ఎన్నికల క్షేత్రంలో పోరాడి మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 19621 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెసు అభ్యర్థి సుబ్బారెడ్డి గెలుపొందారు. కెజిఎఫ్ నియోజకవర్గంలో తంగరాజుకు 1008 ఓట్లు వచ్చాయి. కెఆర్‌పురా అభ్యర్థి ఎం.నంజేగౌడకు 1220, గుల్బర్గా రూరల్ అభ్యర్థిపాండురంగ మన్వీకర్‌కు 822 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎంకు 0.06 శాతం ఓట్లు వచ్చాయి.

రెండోరోజూ అదే తీరు..

◆కొనసాగుతున్న మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష ◆ఇన్‌ఛార్జి మంత్రికి ఫిర్యాదులు
◆కళ్యాణదుర్గం అసమ్మతి నేతలు దూరం ◆ 'అనంత' గుంతకల్లుల్లోనూ అదే తీరు



అనంతపురం జిల్లాలోని వైసిపి నాయకుల్లో గ్రూపు తగదాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. జిల్లాలోని ఆపార్టీ నాయకుల్లో నెలకొన్న గ్రూపు తగాదాలను రూపుమాపడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జిల్లాలో రెండు రోజులుగా మాకాం వేశారు. అందులో భాగంగా రెండోరోజైన శనివారం నిర్వహించిన సమీక్షలో అసంతృప్తి నాయకులు తమ నియోజకవర్గ నాయకుడిపై జిల్లా మంత్రికి ఫిర్యాదులు చేశారు. రెండో రోజైన శనివారం జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గ నాయకులతో జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమీక్ష చేశారు. ఈసందర్భంగా అసంతృప్తివాదులు తమ సమస్యలను మంత్రికి వివరించారు.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

వైసిపిలోని గ్రూపు తగాదాలను రూపు మాపి అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే ఉద్దేశ్యంతో వైసిపి అధిష్టానం చేపట్టిన దిద్దుబాటు కొనసాగుతోంది. జిల్లా ఇంఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండు రోజులుగా ఇక్కడే మకాం వేసిన విషయం తెలిసిందే. రెండో రోజు కూడా జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గాల సమీక్ష చేపట్టారు. మొదటి రోజు తరహాలోనే రెండో రోజు సమీక్షలోనూ ఎమ్మెల్యేలపై ఆరోపణలను, అసంతృప్తులు కొనసాగినట్టు సమాచారం. శనివారం కళ్యాణదుర్గం నియోజకవర్గ సమీక్ష కొనసాగింది. ఈ సమీక్షలో మంత్రి ఉషచరణ్ శ్రీ పాల్గొన్నారు.అయితే ఈ సమీక్షకు ఆమెపై అసంతృప్తితోనున్న నేతలు ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగానూ మారింది. నియోజకవర్గ పరిశీలకులు ముందుగానే అసంతృప్తి నేతలకు సమాచారమిచ్చినా తాము రాబోమని ఫోనులోనే తేల్చిచెప్పినట్టు సమాచారం. బోయ తిప్పేస్వామి, ఎల్ఎం.మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, హనుమంతరాయుడు, కోనాపురం గంగాధర్ తదితర అసంతృప్తి నేతలెవరూ సమీక్షకు హాజరవలేదు. ఈ నేతలంతా ఇది వరకే అధిష్టానానికి మంత్రి వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో రెండు,మూడు పర్యాయాలు అధిష్టానం ముఖ్య నేత వద్దనే పంచాయతీ జరిగినా తీరు మారకపోవడంతో సమీక్షకు దూరంగా నున్నట్టు అసంతృప్తి గ్రూపు నేతలు చెబుతున్నారు. వ్యతిరేక గ్రూపు పూర్తిగా దూరంగా ఉండటంతో మంత్రి మద్దతుదారులతోనే సమీక్ష పూర్తయింది. అనంతపురం నియోజకవర్గం సమీక్షలోనూ అసంతృప్తుల ఫిర్యాదులు అధికంగానే సాగినట్టు సమాచారం. ముందు నుంచి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వ్యతిరేక గ్రూపు ఒకటి ఉంది. ఐదుగురు నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేక గ్రూపు మరోమారు మంత్రి ఎదుట కూడా తమ ఇబ్బందులను తెలియజేసినట్టు సమాచారం. పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రభుత్వ కార్యాక్రమాల్లోనూ అందరినీ సమన్వయం చేయడం లేదని చెప్పినట్టు తెలుస్తోంది. ఇక గుంతకల్లు నియోజకవర్గం వరకు చూసినప్పుడు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే ఫిర్యాదులు, ఆరోపణలున్నట్టు సమాచారం. అసంతృప్తి నేతలు ఇక్కడ తక్కువగా ఉండటంతో నియోజకవర్గ సమీక్ష కొంత సాఫీగానే సాగినట్టు సమాచారం.

నేడు రెండు నియోజకవర్గాలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండు రోజులుగా చేపట్టిన సమీక్షలో ఆరు నియోజకవర్గాలు పూర్తయ్యాయి. ఇక మిగిలింది శింగనమల, రాప్తాడు ఈ రెండు నియోజకవర్గాల సమీక్ష కూడా ఆదివారం జరుపునున్నారు. దీంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమీక్ష పూర్తవనుంది. ఇప్పటి వరకు జరిగిన ఆరు నియోజకవర్గాల్లో గుంతకల్లు ఒక్క నియోజకవర్గంలోనే అసంతృప్తులు తక్కువగా ఉన్నాయి. తక్కిన అన్ని చోట్ల పెద్దఎత్తునే ఎమ్మెల్యేలపై ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్య నేతలందరూ అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. అయితే వీటిపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా వైసిపి నేతల్లో చర్చనీయాంశంగానూ మారింది. అన్నింటినీ విన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అసంతృప్తులను సంతృప్తి పరిచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది కూడా పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. చర్యలేవీ లేకుండా కేవలం విని వెళ్లినంత మాత్రానా జరిగే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలను సైతం వారు లేవనెత్తుతున్నారు.

నాడు- నేడు పనులు త్వరతగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ ఎమ్. గౌతమి

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

నాడు- నేడు కార్యక్రమం క్రింద చేపట్టిన పనులను త్వరితతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎమ్. గౌతమి అధికారులను ఆదేశించారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిల్వచేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు పున: ప్రారంభించడానికి మునుపే నాడు- నేడు కింద చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతుల పనులు, గ్రీన్ చాక్ బోర్డు, నేలపై టైల్స్ వేయడం, రంగులు వేయడంలాంటి పనులు చేపట్టామని, వర్షం కురిస్తే పాఠశాలల లోపు నీరు నిలిచేదని అందుకోసం నాలుగు అడుగుల మేర ఎత్తు కూడా పెంచామని ఈసందర్భంగా ఎంఇఒ కలెక్టర్ కు వివరించారు. అనంతరం విద్యార్థులకు పంపిణీ చేయనున్న యూనిఫాం మెటీరియల్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఆ మెటీరియల్ విద్యార్థులు పాఠశాలల్లో చేరిన తర్వాత వారి తల్లిదండ్రులకు అందిస్తారని,వారు వారి పిల్లల సైజుకు అనుగుణంగా వాటిని కుట్టించాల్సి ఉంటుందని, అందుకు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వం నుండి రావాల్సి ఉందని డిఇఒ కలెక్టర్‌కు తెలిపారు. పాఠశాల తనిఖీలకు వెళ్లే అధికారులకు అందుకు సంబంధించిన ఒక చెక్ లిస్ట్ ని తయారు చేసి ఇవ్వాలని, వారు పరిశీలించిన అంశాలను అందులో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. బుక్కరాయసముద్రం మండల పరిధిలోని 57 పాఠశాలల్లో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు సరఫరా చేయవలసిన పాఠ్య, అభ్యసన, నోటు పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠ్యపుస్తకంలో ముద్రించి ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా రికార్డు కాబడి ఉన్న అంశాన్ని పరిశీలించారు. సకాలంలో పుస్తకాలన్నింటినీ సరఫరా చేయాలని ఈసందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ కృష్ణయ్య, మండల ప్రత్యేక అధికారి నాగేశ్వర్ రెడ్డి, ఎంఇఒ గురు ప్రసాద్, హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎస్ఎ ఏపీవో నారాయణస్వామి, ఎఎస్ఒ మారుతి, భాస్కర్, ఇతరఅధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించండి : బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎమ్. గౌతమి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డేలో భాగంగా శనివారం ఉదయం బుక్కరాయసముద్రం మండలంలో అడ్డదిబ్బ, సిద్ధరాంపురం రోడ్డు లేఅవుట్లలో చేపడుతున్న జగనన్న గృహ నిర్మాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలలో బేస్‌మెంట్ స్థాయిలో నిలిచి ఉన్న నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి సంబంధిత లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. బిబిఎల్ నుంచి బిఎల్ స్థాయికి, రూఫ్ లెవెల్ నుంచి ఆర్సీ స్థాయికివచ్చేలా ఇళ్ల నిర్మాణంలో వెంటనే పురోగతి చూపించాలని, స్టేజి అప్డేట్లు ఎప్పటికప్పుడు చేపట్టాలని ఆదేశించారు. లేఅవుట్లలో పూర్తిచేసిన గృహాలను ఇతర లబ్ధిదారులకు చూపించి వారు కూడా వివిధ దశలలో ఉన్న తమ గృహాలను పూర్తిచేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పూర్తయిన గృహాలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ప్రస్తుతం అప్లోడ్ చేసిన బిల్లులకు వెంటనే నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని కేటాయించిన లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, డిఇ శ్రీమన్నారాయణ, ఎఇ రాజశేఖర్ రెడ్డి, ఎపిఎం మద్దిలేటి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఇఎపిసెట్ ఛైర్మన్ రంగజనార్ధన్

ఈఏపీసెట్-23కు సర్వం సిద్ధం

15 నుంచి 19 వరకు ఇంజనీరింగ్ , 22 నుండి 23 వరకు అగ్రికల్చర్ , ఫార్మసీ పరీక్షలు
ఈఏపీసెట్ ఛైర్మన్ ఆచార్య రంగజనార్ధన్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ, ఎపీ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్, అగ్రికల్చం, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్ -23) ఈనెల 15 నుండి 19 వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు 22 నుండి23 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి, ఈఏపీ సెట్ చెర్మన్ ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానికి వర్శిటీ ఉపకులపతి కాన్ఫరెన్స్ హల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం అందుకు సంబందించిన వివరాలను వెల్లడించారు. శనివారం వరకు ఈఏపీసెట్ పరీక్షలకు 3,37,733 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు, ఇందులో ఇంజనీరింగ్ కు 2,71,193 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశానికి 99,557 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ రెండింటికీ కలిపి 983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రవేశపరీక్షలకు గాను ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 136 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన పరీక్ష కేంద్రాలనే 97 శాతం కేటాయించామన్నారు. ఉదయం, సాయంత్రం జరిగే ఈ పరీక్షలకు ఒక్కో సెషన్ 27 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకుంటున్నారన్నారు. అందులో కేటగిరీలు, గ్రూపులు తదితర వాటిలో ఏమైనా తప్పులు ఉంటే ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. ఇక పరీక్ష హాలుకు గంటన్నర ముందే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష కేంద్రంలో ఇన్‌విజిలేటర్ చెప్పే సూచనలు తప్పక పాటించాలన్నారు. విద్యార్థులు పరీక్ష హాలు లోకి కేవలం హల్ టికెట్, బ్లూ,బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకెళ్లాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వారి కేటగిరీలకు సంబందించి గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి సమర్పించాల్సుంటుందన్నారు. అలా చేయని విద్యార్థులు ఫలితాలు హోల్డ్‌లో పెడతామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేందుకు బస్సులు నడపాలని రీజనల్ మేనేజర్లకు, కలెక్టర్లుకు సమాచారం ఇచ్చామన్నారు.ఈకార్యక్రమంలో ఈఏపీసెట్ కన్వీనర్ ఆచార్య శోభాబిందు, రిజిస్టార్ శిశిధర్, భానుమూర్తి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7వ రోజుకు చేరుకున్న 104 ఉద్యోగుల నిరసనలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు చేపట్టిన నిరసనలు శనివారానికి 7వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 104 ఉద్యోగులు తమ విధుల్లో భాగంగా భోజన విరామ సమయంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, మానస తదితరులు హాజరై మాట్లాడుతూ 104ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలన్నారు. 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, పిఎఫ్ ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బఫర్ ఉద్యోగులకు బకాయి ట్రావెలింగ్ అలవెన్స్ వెంటనే చెల్లించాలని, బదిలీల సౌకర్యం కల్పించాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి ఉద్యోగులు యాజమాన్య ప్రతినిధులతో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న 104 ఉద్యోగులు

సమావేశాలతోనే సరి...

◆జిల్లా సమస్యలపై పట్టించుకోని ఎంపీ
◆రాజధానికి ఒకటే రైలు.. ఒకటే కౌంటర్
◆రైలు ఎక్కాలంటే పట్టాలు దాటాల్సిందే...

హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఉన్న ఒకేఒక్క కౌంటర్ వద్ద టికెట్ల కోసం క్యూ కట్టిన ప్రయాణికులు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. ఈ సమస్యలు కేవలం సమావేశాల్లో ప్రస్తావించడానికే పరిమితమయ్యాయన్న విమర్శలు వినపడుతున్నాయి. హిందూపురం పార్లమెంట్‌నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచినప్పటినుంచి గోరంట్ల మాధవ్ అనంతపురం జిల్లా కేంద్రానికి లేదా...దేశ రాజధానికి పరిమితమవుతున్నారు. ఇక్కడి సమస్యలు ఆయనకు పట్టవు. సమస్యలపై పత్రికల్లో కథనాలు వస్తే...వాటిపై స్థానిక నాయకులు ఒత్తిడి తెస్తే....అలా సమావేశాలు నిర్వహించి....సమస్యలపై చర్చించి మమ అనిపిస్తారే తప్ప వాటి పరిష్కారానికి చొరవ చూపరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు నిదర్శనం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలే. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఎంపీ మాధవ్ గత సంవత్సరం డిసెంబర్ 6 హిందూపురం రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి బెంగళూరు డివిజన్ మేనేజర్ హాజరు కాలేదు. అతని ప్రతినిధిగా రైల్వే ఎడిఇఎన్ వంధేనాథ్ షేకావత్ హాజరయ్యారు. అన్ని సమస్యలపై చర్చించారు. సమస్యలను డిఆర్ఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని నాడు చెప్పారు. అయితే ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇందులో ముఖ్యమైన సమస్యలను రైల్వే మంత్రితో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎంపీ అరోజు చెప్పారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు శీతకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశం రెండు పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. బడ్జెట్ సమావేశంలో ప్రత్యేకించి రైల్వే బడ్జెట్‌పై సమావేశం జరిగింది. ఆ సమయంలో సైతం మన ఎంపీ నోరు విప్పలేదు. దీంతో హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం తర్వాత అన్ని విధాలా అభివృద్ధి చెందిన పట్టణం హిందూపురం. ఇక్కడ రెండు లక్షలకు పైగా జనాభా ఉంది.హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాలకు కేంద్ర బిందుపు హిందూపురం పట్టణం. దశబ్దాల క్రితమే నిర్మించిన ఇక్కడి రైల్వే స్టేషన్ రాక పోకలకు ముఖ్యమైన వనరు. ఇంతటి ప్రధానమైన రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడంలో పాలకులు వెనుకబడ్డారు. ఎంతటి వెనుకబాటు తనమంటే ఇక్కడి నుంచి రాజదాని ప్రాంతమైన విజయవాడ, విశాఖపట్నానికి ఒకే రైలు నడుస్తోంది. అది కూడా బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్. అనాదిగా ఈ రైలు నడుస్తోంది. నాటికి నేటికి ప్రయాణికులు 50శాతానికి పైగా పెరిగినప్పటికి ఒక్కటే రైలు నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీ పెరగడంతో విజయవాడ మీదుగా బెంగళూరు నుంచి మచిలీపట్నం వరకు కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో మంగళవారం, గురువారం, శనివారం మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. దీనిని ప్రతి రోజు నడిచే విధంగా చర్యలు తీసుకుంటే కాస్తా రద్దీ తగ్గే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికి దీని గురించి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఇద్దరు ఎంపీలు ఏ మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. హిందూపురం పార్లమెంట్ నుంచి గెలుస్తున్న పార్లమెంట్ సభ్యులు కనీస సౌకర్యాలకు నోచుకుని హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై నోరు మెదపడం లేదు. సమస్యలను వివరించిన రైల్వే ఉన్నాతాధికారులతో చర్చిస్తే చిన్న చిన్న సమస్యలు పరిష్కారం అవుతాయి. అయినప్పటికి ఆ దిశగా పాలకులు ఆలోచించడం లేదు.

నిత్యం వేలాది మంది ప్రయాణం

విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మహానగరాల్లో ఉన్న విద్యాసంస్థల్లో హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల నుంచి దాదాపు 10 నుంచి 15వేల మంది విద్యార్థులు,ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50వేల మంది వరకు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ఉన్న ఒక్క ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు వారంలో మూడు రోజుల పాటు నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతి రోజు తిరిగే విధంగా చర్యలు తీసుకుని, దీంతో పాటు అదనంగా మరోక రైలు నడిచే విధంగా చర్యలు తీసుకున్నా రద్దీ తగ్గదు. దీంతో పాటు స్టేషన్‌లో సింగిల్ రిజర్వేషన్ కౌంటర్‌తో ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిందూపురం వ్యాపార కేంద్రంతో పాటు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో పాటు ఈ ప్రాంత విద్యార్థులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ప్రతి రోజు హిందూపురం రైల్వే స్టేషన్‌కు రూ.2 లక్షల నుంచి రూ. 2.50లక్షల వరకు ఆదాయం ఉంది. నెలకు సుమారు రూ.70లక్షల వరకు పురం రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. అయితే అందుకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన రైల్వే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సింగల్ కౌంటర్ వల్ల ప్రయాణికులకు పూర్తి స్థాయిలో టికెట్టు అందక ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ, విశాఖపట్నానికి వెళ్లే ప్రశాంతి రైలుకు అయితే తత్కాల్ టికెట్లు మూడు నిమిషాల్లో పూర్తి అవుతున్నాయి. సిబ్బంది, కంప్యూటర్లు ఉన్నప్పటికి రెండవ కౌంటర్ అనుమతులు లేక పోవడంతో ప్రారంభించ లేదు.

అధికారుల నిర్లక్ష్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఏ రైల్వే స్టేషన్‌లో లేనివిధంగా హిందూపురం రైల్వే స్టేషన్‌లో వింత పరిస్థితి ఉంది. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ఎక్కడ చూసిన మొదటి ప్లాట్ ఫాంపై జరుగుతాయి. అయితే హిందూపురం రైల్వే స్టేషన్ లో మాత్రం 2వ, 3వ ఫ్లాట్ ఫాంలపై రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. దీనికి ప్రధాన కారణం రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం నిలువెత్తున కనిపిస్తోంది. ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి టికెట్ తీసుకొని రైలు ఎక్కడానికి వెళ్లాలంటే తప్పనిసరిగా ఓవర్ బ్రిడ్జ్ ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు, అంగ వైకల్యం ఉన్నవారు అయితే వారి బాధలు వర్ణనాతీతం. వీరికి అవసరమైన లిఫ్ట్, ర్యాంప్ బ్రిడ్జి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ప్రతి రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేషన్ బోర్డ్ ఏర్పాటు చేసి ఉంటారు. అయితే ఇక్కడ వాటిని కూడా ఏర్పాటు చేయలేదు. ఏ కోచ్ ఎక్కడ వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. మరి కొంతమంది బ్రిడ్జి ఎక్కి దిగడానికి ఆలస్యం అవుతుందని ప్లాట్ ఫామ్ దాటుకుని వస్తున్నారు. ఆ సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా నిండు ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది.

సమావేశం నిర్వహించారు..చేతులు దులుపుకున్నారు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఎంపీ గోరంట్ల మాధవ్ రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో అన్ని సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇక్కడ పరిష్కరం కాని సమస్యలను రైల్వే మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని అన్నారు. ఇది జరిగి 6 నెలలు పూర్తి అయిన్నప్పటికి కనీసం ఒక్క ఫోన్ కాల్‌తో ఏర్పాటు అయ్యే రెండవ టికెట్ కౌంటర్ సైతం ఏర్పాటు కాలేదు దీనిని బట్టి చూస్తే అభివృద్ధి, ప్రజాసేవపై స్థానిక ఎంపీకి ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్లే అర్థమవుతోంది.

రైల్వే అధికారులతో సమీక్ష చేస్తున్న ఎంపీ (ఫైల్)

దళిత సర్పంచిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం
మండల పరిధిలోని దుర్గం దళిత సర్పంచి సాకే రామాంజనేయులుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం సిద్దరాచర్లలో దళిత సర్పంచి రామాంజనేయులుపై అగ్రవర్ణాలు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల కాలంలో దళితులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. దుర్గం గ్రామానికి చెందిన దళిత సర్పంచి రామాంజనేయులుపై గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణాల వారు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. వెంటనే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే దళితులపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఫోరం నెరమెట్ల యల్లన్న,అప్పా టీం చిన్న ఆంజనేయులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు నార్పల పుల్లన్న, కెవిపిఎస్ జిల్లా నాయకులు కుళ్లాయప్ప, బాణా శీన, సర్పంచి కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫీవర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
జిల్లా సరిహద్దున ఆనుకుని ఉన్న కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆ ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. గత వారంలో అక్కడ ఎన్నికల ఫలితాలు ఏ రకంగా ఉంటాయన్నది ఎక్కడ చూసినా జరిగిన చర్చ. జిల్లావాసులు అందరూ అక్కడి రాజకీయ పరిణామాలను ఆసక్తిగా గమనించడం గమనార్హం. 2018 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో జెడిఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా తదుపరి ఏర్పాటు చేసుకున్న పరిణామాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి బిజెపి అధికారాన్ని చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత అక్కడ మత ఘర్షణలు పెరగడం వంటివి జిల్లావాసులు గమనిస్తూ వచ్చారు. ఎందుకంటే జిల్లావాసులు అత్యధిక మంది కర్నాటకతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అక్కడి రాజకీయాల పట్ల ఇక్కడి వారు అంతటి ఆసక్తి కనబరచడానికి కారణం. ఎన్నికల ఫలితాలు కూడా ఈ వారాంతమైన శనివారం నాడే వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అందరి అంచనాలకు మించి సీట్లను గెలుచుకుంది. అంతా 100 నుంచి 110 స్థానాల్లోపే గెలుస్తుందని అంచనా వేసినా ఆ తర్వాత బిజెపిని తట్టుకుని ఏ రకంగా అధికారాన్ని చేపడుతుందో చూడాలని భావిస్తూ వచ్చారు. అయితే అందరి అంచనాలకంటే అధికంగా 136 సీట్లలో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. పూర్తిస్థాయి మెజార్టీ రావడంతో ఇక్కడ రాజకీయ నాయకులు కూడా ఈ ఫలితాలను విశ్లేషించుకోవడం కనిపిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా ప్రజలున్నారన్నది స్పష్టమవుతోందన్న చర్చ సాగుతోంది. ఇక్కడ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరైనా జతకడితే ఏమవుతుందోనన్న చర్చ కూడా సాగుతోంది. ఇదే సమయంలో రాష్ట్రంలోనూ ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయన్న ప్రచారం సాగుతోంది. అందుకు తగ్గట్టుగానే అధికార వైసిపి ఎన్నికల కసరత్తును ప్రారంభించినట్టు కనిపిస్తోంది. ఇటీవల గడిచిన రెండు రోజులుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇక్కడే మకాం వేసి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేపడుతున్నారు. నాయకుల్లో అంతర్గతంగా ఉన్న విభేదాలను గుర్తించి సమన్వయ లోపాలను సరిదిద్దే పని చేపడుతున్నారు. ఇది చూసి అధికార వైసిపి ఎన్నికల కసరత్తు సిద్ధమవుతోందా అన్న చర్చ కూడా రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇదిలాగుంటే ఈవారంలో వాతావరణంలోనూ మార్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అంతక మునుపు వారం వరుసగా వర్షాలు పడ్డాయి. గత వారంలో చూస్తే వర్షాలు తగ్గి వడగాల్పులు వీయడంతో జనం ఉక్కపోతతో అల్లాడారు. వారాంతంలో మరోమారు వాతావరణం చల్లబడటం, వర్షాలొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. రాజకీయాల్లోలాగానే వాతావరణంలోనూ తరచూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవిలో వస్తున్న మార్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఒకవైపు వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వాతావరణం చల్లబడిన అని అనుకునేలోపే వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మొత్తంగా ఈ వారం అటు రాజకీయ పరిణామాలు, ఇటు వాతావరణ మార్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. వర్షాలు రావడంతో ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యే పనిలో రైతులు పడ్డారు. దుక్కులు దునుకునేందుకు సిద్ధమవుతున్నారు. విత్తన పంపిణీకి వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించింది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వాటా డబ్బులు కడితే విత్తన పంపిణీ చేపడతామని ప్రభుత్వం చెబుతోంది. రైతులు ఆ పనుల్లో ఉన్నారు.

అనంతలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని 8వ వార్డులో టిడిపి నాయకులు శనివారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి మారుతీకుమార్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు రంగా ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సుధాకర్‌యాదవ్, టిడిపి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోతుల నరసింహులు, ముక్తియార్, కూచిహరి, బోయ్మినేని శివ, పూల బాషా, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

శింగనమల : మండల కేంద్రంలోని టిడిపి సీనియర్ కార్యకర్త గాజుల మస్తాన్ మృతి చెందడంతో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా దండు మాట్లాడుతూ మండలంలో టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమానికైనా హాజరయ్యే మస్తాన్ మృతి తీరని లోటు అన్నారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు ఎం.ఆదినారాయణ, కుళ్లాయప్ప, బెస్త నారాయణస్వామి, చాకలి వెంకటేష్, కాయల సురేష్, మొహమ్మద్ గౌస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బ్యాంకు అధికారి ఎర్రిస్వామి సేవలు ఆదర్శం

ఎర్రిస్వామిని సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మారాల బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ ఎర్రిస్వామి సేవలు ఆదర్శనీయమని ఆ బ్యాంక్ మేనేజర్ ఎస్.మధుసూదన్ కొనియాడారు. మారాల బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న ఎర్రిస్వామి బదిలీపై కొండాపురం బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల పాటు బ్యాంకులో విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. ఇలాంటి అనుభవజ్ఞులైన అధికారులు ఉండటం కొత్తగా వస్తున్న ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సాయి భరత్, క్యాషియర్ రవీంద్ర, మెసింజర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

శింగనమల : మండలంలోని చిన్నజల్లాలపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పెద్దన్నను నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ శనివారం పరామర్శించారు. పెద్దన్న ద్విచక్ర వాహనంలో నుంచి పడి గాయపడ్డాడు. దీంతో అనంతపురంలోని అమరావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న శ్రావణి బాధితుడిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధైర్య పడవద్దని తాము అండగా ఉండటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిదానంతనాయుడు, చిన్న జలాలపురం సుధాకర్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశనాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

అనంతపురం : ప్రముఖ ప్రదేశాల్లో దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని టిడిపి జిల్లా మైనార్టీ కమిటీ అధికార ప్రతినిధి పి.తూముచెర్ల బాబా ఫక్రుద్దీన్‌వలి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనంతపురంలో నడిమివంక నుంచి కలెక్టరేట్, పెన్నార్ భవన్ వరకూ రోడ్డు విస్తరణలో భాగంగా దేశ నాయకులు, మహనీయులు, సమాజ సేవకులు, సంఘసంస్కర్త ల విగ్రహాలను తొలగించారన్నారు. వీటిలో నాయకుల ఒత్తిడి మేరకు కేవలం ఫెర్రర్ విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. మిగిలిన విగ్రహాలను మరిచారన్నారు. కావున ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి తొలగించిన దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడాసామగ్రి పంపిణీ

ఉరవకొండ : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరానికి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాస్కెట్ బాళ్లు, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈమేరకు టిడిపి నాయకులు జెండా సలాం, రహంతుల్లా కలిసి శనివారం క్రీడాకారులకు సామగ్రి అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే కేశవ్‌కు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి : రాష్ట్ర పెన్షనర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర పెన్షనర్ల సంఘం మండల కార్యదర్శి కె.రామ్మోహన్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఎలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగులకు ఒకటో తేదీనే పెన్షన్ చెల్లించాలన్నారు. ముందుగా ఇటీవల మరణించిన పెన్షనర్ డి.కుల్లాయమ్మ సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, వెంకటేష్, అదనపు కార్యదర్శి జేన్నే కుల్లాయి బాబు, కోశాధికారి పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 517 కేసులు పరిష్కారం

గుత్తి : పట్టణంలోని న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు డి.శ్రీనివాసులు, సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత 517 కేసులు పరిష్కరించారు. రూ.68.79 లక్షలు కక్షిదారులకు చెల్లించేలా కేసులను తీర్పుచెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మనోహర్‌బాబు, ఎపిపి బి.సుదర్శన్‌రెడ్డి, న్యాయవాదులు గంగాధర్ కుమార్, నిర్మలాదేవి, సూర్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేష్ కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని వినతి

గుత్తి : నియోజకవర్గ అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కోరారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రిని వైసిపి జిల్లా నాయకులు కె.మధుసూదన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుంతకల్లు నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

మంత్రి పెద్దిరెడ్డితో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

'అమ్మ'ను పదిలంగా చూసుకుందాం

వయస్సు మీద పడ్డాక జాగ్రత్తలు తీసుకోవాలి - సవేరా ఆసుపత్రి వైద్యులు శిల్పాచౌదరి

ప్రజాశక్తి-అనంతపురం
తొమ్మిది నెలలు మనల్ని కడుపులో దాచుకుని.. ఎన్నో బాధలు.. నొప్పులను దింగమింగి జీవితాన్ని ప్రసాదించే అమ్మను జాగ్రత్తగా కాపాడుకుందామని సవేరా ఆసుపత్రి వైద్యులు శిల్పాచౌదరని పిలుపునిచ్చారు. శనివారం ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ అన్నీ తానై పెంచే అమ్మకు వయస్సు పెరిగేకొద్దీ జబ్బులు కూడా అధికంగానే వస్తాయన్నారు. కావున ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా జబ్బులను గుర్తించి ముందుగానే చికిత్స అందించాలని సూచించారు. ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే రొమ్ము క్యాన్సర్, పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్ వంటి రోగాలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వీటిని సకాలంలో గుర్తించకపోతే ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇకపోతే రుతువిరతి తర్వాత గుండె జబ్బుల ప్రమాదం అధికంగా ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం రుతువిరతి ఆగిపోయిన మహిళల్లో 30 శాతం మందికి బోలు ఎముకల వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. మరికొందరికి చర్మం మీద దద్దుర్లు రావడం, జుట్టు ఊడిపోవడం, నోట్లో పుండ్లు పడటం, కీళ్ల వాపులు, నొప్పి, తీవ్రంగా తల తిరగడం, జ్వరం లాంటివి రావచ్చు. ఇది ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, గుండె, చర్మం, రక్తం.. ఇలా దేన్నయినా ప్రభావితం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆయా సమస్యలను ముందుగా గుర్తించినట్లయితే చికిత్స తీసుకుని మహిళలను కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వయస్సు మీద పడిన మహిళల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమేమనగా మా కక్షిదారైన **గుజ్జల అక్కులన్న తండ్రి జి. ఓబులేసప్ప, ఇంటి. నెం. 6-2-421-3, కొవ్వూర్ నగర్, అనంతపురము టౌన్, అనంతపురము జిల్లా** అనువారి తరపున ఇచ్చిన బహిరంగ ప్రకటన ఏమనగా, మా కక్షిదారు క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని మేనేజ్‌మెంట్ చేయుటకు వీలులేక అనంతపురము జిల్లా తాడిపత్రి టౌన్, 6వ రోడ్డు, క్రిష్ణాపురం ఇ.నెం. 3/736-6-2లో ఉండే **తమ్మినేని నరసింహులు కుమారుడు తమ్మినేని లవకుమార్** పేరుతో 03-06-2021న రిజిష్టర్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం.6274/2021గా రిజిష్టర్ చేయించినాడు. **తమ్మినేని లవకుమార్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందినప్పటి నుండి సదరు లవకుమార్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ నిబంధనల ప్రకారం వ్యవహరించనందున** నా కక్షిదారు 03-06-2021న రాయించిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు ను 08-05-2023వ తేదీన దస్తావేజు నెం.5524/2003వ రిజిష్టర్ దస్తావేజు ద్వారా రద్దు పరచినాడు. అదే రోజున 08-05-2023వ తేదీన మా కక్షిదారు షెడ్యూల్ ఆస్తిని శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం, కత్తివారిపల్లెలో ఉండే **పాలెం చెన్నకేశవరెడ్డి కుమారుడు పాలెం రామాంజుల రెడ్డి** అనువారికి విక్రయించి రిజిష్టర్డ్ విక్రయ పత్రం నెం. 5525/2023 ద్వారా స్వాధీనం చేయడమైనది. కావున షెడ్యూల్ ఆస్తికి నా కక్షిదారునికి గాని, **తమ్మినేని లవకుమార్**‌లకు గాని ఎటువంటి సంబంధం లేదని తెలియజేయడమైనది. ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడమేమనగా **తమ్మినేని లవకుమార్** తో షెడ్యూల్ ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరుపరాదని అటు జరిపినచో అది చట్ట వ్యతిరేకమనియు, అటువంటి లావాదేవీలకు నా కక్షిదారు గాని షెడ్యూల్ ఆస్తికి కానీ బాధ్యత ఉండదని తెలియజేయడమైనది.

షెడ్యూలు

అనంతపురము జిల్లా, అనంతపురము SRD అనంతపురము గ్రామ పొలం, అనంతపురం టౌన్, అనంతపురము మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి వివరములు వార్డు నెం. 1, సర్వే నెం.117/1ఎలో ఎ.సి. 0.58 సెంట్లపైకి 0.11.60 పైకి ప్లాట్ నెం.9, 10 పైకి రోడ్డుకు పోను ఎ.సి. 0.10 సెంట్లపైకి ఎ.సి. 0.05 సెంట్లు లేక 242 చదరపు గజములు గల ఆస్తికి దిశలమేరకు.

బి. హర్షవర్ధన్‌రెడ్డి, అడ్వకేట్, అనంతపురము
కె.యస్. ప్రభాకర్‌రెడ్డి, అడ్వకేట్, కదిరి.

కర్నాటకలో కాంగ్రెస్ గెలుపుపై హర్షం

వ్యాపారికి స్వీట్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వడ్ల ఆంజనేయులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్
కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు వామపక్ష నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. రాబోవు కాలంలో ఢిల్లీ నుంచి గల్లీ దాకా కాంగ్రెస్ హవా కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంజీవరాయుడు, దర్గాహొన్నూరు, నాగరాజు, గోనేహాల్ హరిజన తిప్పన్న, ఉద్దేహాల్ హమాలీ నాయకుడు వెన్నయ్య, సిఐటియు నాయకులు ఓబులేసు, రాము, తదితర వామపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం పట్ల శనివారం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఊరువాకిలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ కర్ణాటక ప్రజలు ఎంతో విజ్ఞత కలిగి అభివృద్ధిని, సంక్షేమాన్ని ఇచ్చే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకున్నారన్నారు. రానున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికలకు ఈ విజయం ఊపందిస్తుందన్నారు. అలాగే కర్ణాటకలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జిల్లాకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు ఎన్. రఘువీరారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఊరువాకిలి అనిల్‌కుమార్, పట్టణ అధ్యక్షులు జయన్న, బిల్, అయూబ్, షరీఫ్ పాల్గొన్నారు.

ఉరవకొండ : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో నియోజకవర్గ కేంద్రంలో పీసీసీ డెలిగేట్ సభ్యులు వడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం బాణాసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి చెంప పెట్టు అన్నారు. కర్ణాటకలో ప్రజాస్వామ్యం విజయం సాధించిందన్నారు. కర్ణాటక ప్రజలు మత రాజకీయాల్ని తిరస్కరించారన్నారు. దేవున్ని, మతాలను అడ్డం పెట్టుకుని బీజేపీ గెలవాలనుకుంది కానీ మత రాజకీయాల్ని చేసి దేశాన్ని అమ్మేస్తున్న వారికి కన్నడ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ప్రజలు, ప్రజాస్వామ్యశక్తులు కలసి నియంతత్వ పాలనకు స్వస్తి పలికాయని దేశంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత పట్టు సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో గెలిపించిన కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు ఆర్.నవీన్ చౌదరి, మల్లికార్జున, రాముడు, గోవిందు పాల్గొన్నారు.

In the Court of the Senior Civil Judge: Gooty
H.M.O.P.No.205/2021
Between:
M.Suseela @ B.Suseela ...Petitioner
And
B.Raghavendra ...Respondant
NOTICE TO THE RESPONDANT
To
B.Raghavendra S/o B.Narasappa, Lorry Driver, R/o D.No.17/1278-A, Rajendra Nagar, Guntakal.

పై అర్జీదారురాలు తనకు నీతో 21-02-1997వ తేదిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వద్ద వివాహమును రద్దు చేయవలయునని పై కోర్టులో అర్జీని దాఖలు చేసుకొనినది. కోర్టువారు సదరు అర్జీకి 05-07-2023వ తేదికి వాయిదా వేసినారు. కావున నీవు 05-07-2023వ తేదిన ఉదయం 10.30 గంllలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలయును. లేనంతట నీ పరోక్షము నందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలుపడమైనది.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

R.V.Chalapathi, B.Satyanarayana
Advocates for Petitioner.

In the Court of the VIth Addl. District Judge: Gooty
E.P.No.28/2022 in O.S. No.18/2018
Between:
T.M. Lakshmi Devi ...Petitioner/D.Hr
AND
Y.Prasad Rao ...Respondant/J.Dr

వేలం ప్రకటన

పై అర్జీదారుడు తనకు ప్రతివాది నుండి రావలసిన డిక్రీ మొత్తము మరియు ఖర్చులకు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని వేలం వేసి తనకు రావలసిన ఇ.పి. మొత్తము మరియు ఖర్చులను ఇప్పించవలయునని కోర్టు వారిని కోరినందున, సదరు కోర్టువారు షెడ్యూలు ఆస్తిని 14-06-2023వ తేదిన పగలు 10.00 గంllలకు బహిరంగంగా వేలం వేయుదురనియు మరియు ఎవరైనను వేలం పాల్గొను వారు కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొని షెడ్యూలు దాఖలు ఆస్తిని వేలంలో కొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

SCHEDULE

open site and House bearing D.No.6/776-A situated at Bhagyanagar, Rajiv Colony residential area of Guntakal in T.P. No.36/1982 on the Northern side of plot No.74 in Thimmanacherla, Sy.No.403/A with the following particulars.

Municipal new ward-4: Present ward-6, D.No.6/776; HSC No.13004 and 23678 and water tap Assessment No.1944.

Boundaries: East: 40 Feet Road, West: E-Seva Kendram, North: Site of Y.Prasada Rao & Plot No.73, South: Half share of Y.Rajanna in the same plot and house.

In between the measurements open site: East-West: 60 feets or 18.288 Mts. North-South:21.06 feets or 6.557 Mts. Totally: 143.33 Sq.Yards or 120.399 Sq.Mts. and in the said site the measurements of Ground floor having roof wit RCC: East-West: 46 feets, North-South: 11 feets, Total:506 Sq.Fts. And the measurements of First Floor for the said house: East-West:46 feets, North-South:11 feets, **Total: 506 Sq.Fts.** Two portions extent 1012 Sq.feets and the measurements and shed having roof with sheets to the north of the said propety: East-West:19 feets, North-South:9 feets, **Total: 171 Sq.Fts.**
D.Hr. value Rs: 16,00,000/-
Amin Value Rs: 24,50,000/-
Sub Registered Value Rs: 16,40,876.
(By Order of the Court)

R.V.Chalapathi, B.Satyanarayana
Advocates for the Petitioner-D.Hr.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు

కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర రాష్ట్ర చైర్మన్ బొప్పారాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ ఎం.గౌతమిని మర్యాద పూర్వకంగా శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జిల్లాకు విచ్చేసిన ఆయన జెఎసి అమరావతి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలతో కలిసి కలెక్టర్‌ను పుచ్చగుచ్చాలు అందజేశారు. అనంతరం ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈనెల 17న అనంతపురంలో ఎపి జెఎసి అమరావతి రెండవ ప్రాంతీయ సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై అసోసియేషన్ నేతలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్ఎన్.దివాకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.ఖాన్, క్లాస్ ఫోర్త్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వర్‌రావు, రాష్ట్ర విఆర్ఓ జనరల్ సెక్రటరీ సాంబ శివరావు, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుళ్లాయప్ప, మధునాయక్, క్లాస్ ఫోర్త్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తోట చెన్నప్ప, డ్రైవర్స్ అసోసియేషన్ రమేష్, ఎపిటియసి జిల్లా అధ్యక్షుడు రాజేష్, గ్రామ వార్డు సచివాలయాల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సల్మాన్ బాషా, వినయ్, వెటర్నిటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థుల సందడి

వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వేసవి శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులు హాజరై పలు విభాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ శనివారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులు విశేషంగా హాజరవడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సూర్య నమస్కారాలు, కథలు చెప్పడం, డ్యాన్స్, కథలు చదవడం వంటి కార్యక్రమాల్లో 72 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఇంతియాజ్, కావేరి, హేమ మాలిని, ఇందిర, విద్యార్థులు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

అమిద్యాలకు తరలిన శ్రీవారి ఉత్సవ విగ్రహాలు

అమిద్యాలకు వెళ్తున్న శ్రీవారు

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ముగియడంతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు శనివారం పెన్నఅహోబిలం నుంచి అమిద్యాలకు తరలివెళ్లారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. బ్రహోత్సవాల సందర్భంగా ఈనెల 2న అమిద్యాల గ్రామం నుంచి ఉత్సవ విగ్రహాలను పెన్నఅహోబిలం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఉత్సవాలు ముగియడంతో స్వామివారి ఉత్సవ విగ్రహాలను అమిద్యాలకు తీసుకొచ్చారు. దీంతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, మయూరం బాలాజీస్వామి, గుండురావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే 'తోపుదుర్తి'

అనంతపురం : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శనివారం కలిశారు. శనివారం పార్టీ సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రిని ఎమ్మెల్యే తోపుదుర్తి కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఆయనతోపాటు వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాప్తాడు నియోజకవర్గ అబ్జర్వర్ బుల్లెట్ సురేష్, తదితరులు ఉన్నారు.

పన్ను రశీదులు పంపిణీ

నార్పల : మండల కేంద్రంలోని సిపిఐ కాలనీలోని ప్రజలకు పన్నులకు సంబంధించిన రశీదులను శనివారం పంపిణీ చేశారు. సిపిఐ కాలనీలో అధికారులు పంచాయతీ పన్నులు వసూలు చేసి రశీదులు ఇవ్వలేదని పలు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ఇంటి పన్ను రశీదులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది లక్ష్మేంద్ర, ప్రభుదాసు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ యాత్రలను జయప్రదం చేయండి : టిడిపి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా ఈనెల 15న అనంపురంలో చేపడుతున్న సంఘీభావ యాత్రను టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పాదయాత్ర చేపట్టి వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం సంఘీభావంగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. అనంతపురంలో ఉదయం 7 గంటలకు తపోవనం నుంచి పాదయాత్ర ప్రారంభమై, నారాయణపురం, ఇందిరమ్మ కాలనీ, మీదుగా సాగి నాగిరెడ్డిపల్లిలో పాదయాత్ర ముగుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కళ్యాణదుర్గం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన పాదయాత్రకు సంఘీభావంగా చేపడుతున్న పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఉన్నం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న లోకేష్ పాదయాత్ర చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకుంటుందన్నారు. దీంతో ఆరోజు ఉదయం 10 గంటలకు పాపంపల్లి గ్రామం నుంచి పట్టణంలోని సాయిబాబా ఆలయం వరకు సంఘీబావ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కావున పెద్ద నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. అలాగే శెట్టూరు మండలం యాటకల్లు గ్రామ రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి పట్టణంలోని శ్రీగోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కావున టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మకూరు : నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఈనెల 15వ తేదీకి వందరోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఆరోజు సంఘీభావ యాత్ర చేపట్టనున్నట్లు హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మాజీమంత్రి పరిటాల సునీతమ్మ ఆధ్వర్యంలో సజ్జలకాలువ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి పాపంపేట రామాలయం వరకు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నార్పల : నారా లోకేష్ పాదయాత్ర 100 రోజులకు చేరుకున్న సందర్భంగా ఈనెల 15న సంఘీభావ యాత్ర చేపట్టనున్నట్లు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు నార్పల మండలం బి.పప్పూరు గ్రామం నుంచి గంగనపల్లి మీదుగా గూగూడు వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గవ్యాప్తంగా టిడిపి నాయకులు, మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

మృతిచెందిన వెంకటేశ్వర్లు (పాతచిత్రం)

తాడిపత్రి రూరల్ : రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చెల్లవారిపల్లి గ్రామం వద్ద రైల్వే ట్రాక్‌పై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా బేతంచెర్ల గ్రామానికి చెందిన చాకలి వెంకటేశ్వర్లు (26) తన స్నేహితులతో కలిసి తిరుమలకు రైలులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు చల్లవారిపల్లె రైల్వే స్టేషన్ వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.